నేటి నుండి కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-బెలగాం : గిరిజన విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం నుండి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యా లయం ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి, గిరిజన ప్రజా సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్ (గిరిజన సంక్షేమ సంఘం), బి. రవికుమార్ (ఏఐఎస్ఎఫ్), కె. సోమేష్ (పిడిఎస్ఓ), పి. సంగం అయ్యార్ల సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని, సురక్షిత తాగునీరు, పౌష్టికాహారం అందించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో ఏఎన్ఎం లను నియమించాలని, గిరిజన విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీక్షలో అన్ని ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు శక్తి టీంలు అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకిత సురాన ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్స్, పోలీస్ అధికారులు, సిబ్బంది ఆదివారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న బాలికల వసతి గృహం, చాకలి బెలగాంలో గల బాలికల వసతి గృహాలలో గల విద్యార్థులకు, పార్వతీపురం పట్టణ పరిధిలో ఉన్న విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఈగిల్ మరియు బాల్య వివాహాలు, డయల్ 112 సేవలపై అవగాహన కల్పించారు. జిల్లాలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి శక్తి టీం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోందని తెలియచేస్తూ ప్రతి ఒక్క విద్యార్థిని తన యొక్క మొబైల్ ఫోన్లో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేసుకుని అందులో ఉండే 11 ఫ్యూచర్స్ పై అవగాహన చేసుకుని ఆపద సమయంలో శక్తి యాప్ ఎలా వినియోగించుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పార్వతీపురం శక్తి టీం 1 ఇంచార్జ్ మరియు ఎఎస్ఐ లెంక శ్రీనివాసరావు(1154), శక్తి టీం పాల్గొన్నారు.

ముగిసిన ఏపీటీఎఫ్ విద్యా సదస్సు

తూరుపుకొండల్లో మెరిసిన మేరంగి పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పార్వతీపురం మన్యం జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జిల్లా అధ్యక్షుడు మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు విద్యా సదస్సును నిర్వ హించారు. ఫెడరేషన్ లక్ష్యాల సాధనలో ఎదురవుతున్న సవాళ్లను వాటి పరిష్కార మార్గాలను గురించి రాష్ట్రప్రధాన కార్యదర్శి భానుమూర్తి వివరిస్తూ సామాజిక పరిణామాలను అర్థం చేసుకోవడం ద్వారా సమస్యలు అధిగమించ వచ్చని తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ ముందుతరం నాయకులు ఎన్నో కష్ట నష్టాలు అనుభవించి బాధ్యతలకు నిలబడుతూ హక్కులకై కలబడి ఉపాధ్యాయ వర్గానికి అనేక రాయితీలు కల్పించగలిగారని తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో భాగంగా నాడు 1960 ప్రాంతంలో ఫెడరేషన్ ప్రారంభం జరిగిన నాటి విశేషాలతో పాటు మేరంగి గ్రామానికి చెందిన విశేషాలు వివరిస్తూ రౌతు వాసుదేవరావు రచించిన తూరుపు కొండల్లో మెరిసిన మేరంగి పుస్తకావిష్కరణ జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని మండలాలలో ఉద్యమంలో పనిచేసి పదవీ విరమణ పొందిన నలభై మంది ఉపాధ్యాయులకు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణారావు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

పిజిఆర్ఎస్ అర్జీల వివరాలు మీకోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చు : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల వివరాలు మీకోసం వెబ్ సైట్‌లో నమోదు చేయవచ్చని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. ఆదివారం ఒక ప్రకటనను విడుదల చేశారు. అన్ని కార్యాలయాల్లో సోమవారం గ్రీవెన్స్ స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజలనుంచి వినతులు స్వీకరించుటకు సెల్లార్లో ప్రత్యేకంగా సెల్ ను ఏర్పాటు చేశామని చెప్పారు. అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనుటకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

'దీన్ దయాల్ స్పర్శ యోజనా స్కాలర్ షిప్ పరీక్ష' నిర్వహణ

విశాలాంధ్ర-బెలగాం : తపాలా శాఖ ఆధ్వర్యంలో 'దీన్ దయాల్ స్పర్శ యోజనా స్కాలర్ షిప్ పరీక్ష'ను ఆదివారం పార్వతీపురం బెలగాంలోని శ్రీజన్ గ్లోబల్ స్కూల్‌లో పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షలో పార్వతీపురం నుండి పలు పాఠశాలల నుండి 6 నుండి 9వ తరగతి వరకు చదువుతున్న మొత్తం 334 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు తపాలా శాఖ నుండి సంవత్సరానికి 6000/- చొప్పున స్కాలర్ షిప్ వస్తుంది. ఈ సందర్భంగా పార్వతీపురం పోస్టల్ సూపరింటెండెంట్ రెడ్డి బాబురావు మాట్లాడుతూ పిల్లల్లో గల నైపుణ్యాలను వెలికి తీయడంలో ఇటువంటి పరీక్షలు విద్యార్థులకు ఎంతో సహాయ పడతాయని అన్నారు. గత నెలలో "నేషనల్ ఫిలాటెలీ" డే సందర్భంగా "ఎస్సే రైటింగ్" పరీక్షను కొత్తవలస కెపిఎం హైస్కూల్ లో నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రలను అందజేశామని తెలిపారు. ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు తపాలా శాఖ రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహిస్తుందని బాబురావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం పోస్టల్ డివిజన్ తపాలా శాఖ ఉద్యోగులు, శ్రీజన్ గ్లోబల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా జాబ్ మేలాను సద్వినియోగం చేసుకోండి

ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి

విశాలాంధ్ర-సాలూరు : స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నేడు జరగబోవు మెగా జాబ్ మేలాను సద్వినియోగం చేసుకోవాలని కన్వీనర్ ప్రిన్సిపాల్ శ్రీనివాసచారి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించు నిమిత్తం సాలూరులో మెగా జాబ్ మేలాను నిర్వ హిస్తున్నామన్నారు. జాబ్ మేలాకు ప్రముఖ కంపెనీలు అయిన అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, భగవతి ప్రొడక్ట్ ప్రైవేటు లిమిటెడ్, పాటిల్ రైల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రవేట్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్, హీరో మోటార్ సైకిల్, డిమార్ట్, ఫ్లిప్కార్ట్, అమోజాన్, స్విజ్ మొదలగు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు టెన్త్ క్లాస్, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిప్లమో,డిగ్రీ చదివి ఉండాలన్నారు.వారి విద్యార్హత, అర్హతను అనుసరించి ఉద్యోగాన్ని కేటాయిస్తారు. ఐటిఐ ఉత్తీర్ణత చెందినవారికి అప్రెంటీస్ శిక్షణ కొరకు అయా కంపెనీలు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులకు రూ15000 నుండి 22000 వరకు జీతం లభిస్తుందని, అప్రెంటీస్ కొరకు ఎంపిక అయినవారికి రూ.12000 నుండి 15500 వరకు చెల్లిస్తారన్నారు. జాబ్ మేళాలో హాజరగు విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికేట్‌లతో పాటు బయోడేటా, విద్యార్హత ధృవపత్రాలు జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, ఫోటోలు తీసుకొని సోమవారం ఉదయం 10 గంటలకు సాలూరులో హాజరుకావాలని ప్రకటించారు. అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ కానివారు తొమ్మిది గంటల ముప్పై నిమిషాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఐటిఐ సిబ్బంది సహకారం తీసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరములకు ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావుని సంప్రదించాలని తెలిపారు. ఈ మెగా జాబ్ మేలాను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొంది కుటుంబాలలో వెలుగు నింపేందుకు బాటలు వేసుకోవాలని యువతకు పిలుపును ఇస్తున్నట్లు ప్రకటనలో వివరించారు.

మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే ఘన స్వాగతం

విశాలాంధ్ర-పార్వతీపురం : విశాఖను ఐటీ హబ్ గా తీర్చిదిద్దడంతోపాటు ఉత్తరాంధ్ర యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడంలో మానవవనరుల, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషి రాష్ట్రానికి వరమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తెలిపారు. విశాఖలో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ శంఖుస్థాపన సహా విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి లోకేశ్ కు విశాఖ విమానాశ్రయంలో ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం యువతకు ఉపాధి, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా లోకేశ్ అడుగులు వేస్తున్నారని కొనియాడారు. లోకేశ్ చేపడుతున్న కార్యక్రమాల ద్వారా రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేసారు. ఏఐ డేటా సెంటర్ నిర్మాణం పూర్తయితే విశాఖనగరం అంతర్జాతీయంగా ఒక కీలకమైన డిజిటల్ గేట్‌వేగా మారుతుందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు.

కళాశాల మైదానంలో 14న ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపికలు



విశాలాంధ్ర-పార్వతీపురం: స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారంనాడు ఎన్‌సిసి క్యాడెట్ల ఎంపికలు నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు, కళాశాల ఎన్‌సిసి 14(ఏ)వ బెటాలియన్ కెప్టెన్ గుప్తాలు తెలిపారు. కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న బిఏ, బి.కాం, బిఎస్సీ డిగ్రీవిద్యార్థులు అర్హులని తెలిపారు. మెంటల్లీ, ఫిజికల్లీ ఫిట్‌గా ఉండి, 5.5 ఇంచీల ఎత్తుకలిగిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఆరోజు ఉదయం ఏడు గంటలకు మైదానంలో ఎన్‌సిసి అధికారుల సమక్షంలో ఎంపికలు జరుగుతాయని చెప్పారు. మూడేళ్ల ఎన్‌సిసి సర్టిఫికేట్లు కలిగినవారికి డిఫెన్స్,ఆర్మీ, పోలీస్ రిక్రూట్మెంటులలో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

సాలూరు స్కిల్‌హబ్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-సాలూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్‌హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో లిడొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లి కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు త్వరలో ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలను సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్ లేదా డీఎస్‌డీఓ, పార్వతీపురం మన్యం జిల్లా కార్యాలయాల ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనదలచిన అర్హులైన అభ్యర్థులు కళాశాలలోని స్కిల్‌హబ్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాల కొరకు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ మాదిరెడ్డి త్రినాథ్, ఫోన్ నెం: 73825 59022 నెంబరును సంప్రదించాలని తెలిపారు. కావున సాలూరు మరియు పరిసర ప్రాంతాల యువత ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

నేడు ఫించన్‌దారులు సమావేశం

విశాలాంధ్ర-బెలగాం : ఈనెల 13వ తేదీ అనగా సోమవారం ఉదయం 10 గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా ఫించన్ దారుల నెలవారీ సమావేశం బెలగాం రైతు బజార్ సమీపంలో గల పార్వతీపురం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించబడునని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంట జగన్నాథంనాయుడు, దొడ్లంకి గణపతిరావులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండల యూనిట్ల నిర్వహణ గూర్చి, భవిషత్ ప్రణాళికల గూర్చి, రాష్ట్ర స్థాయి సమస్యలు, పరిష్కారం గూర్చి అలాగే అధ్యక్షుని అనుమతితో ఇతర సమస్యలపై అజెండాగా చర్చించడం జరుగుతుందని కావున ఫించన్ దారులు అందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

గిరిజనేతరులకు తొత్తులుగా మారిన గిరిజన బినామీలు

- కాసులు ఇస్తే 1/70 చట్టం బినామీలకి వర్తించదా..?
- గిరిజనేతలరుల వాణిజ్య సముదాలయాలపై చర్యలు ఏవి..?
- బినామీలపై నోరు మెదపని ఆదివాసి గిరిజన సంఘాలు

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో అధికారుల అండదండలతో బినామీలు రెచ్చిపోతున్నారు. వివరాల్లోకి వెళితే స్థానిక మెయిన్ బజార్ శతకం పుట్టు పక్కన కొత్తగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయంపై పత్రికల్లో వార్తలు వచ్చిన రెవెన్యూ పంచాయతీ అధికారుల్లో మాత్రం చలనం లేదు. పత్రికల్లో వార్తలు వస్తే ఆదికారులు మాత్రం అదిగో ఇదిగో అని బూటకపు మాటలు చెప్పి పత్రికా ప్రతినిధులను మభ్యపెట్టడం వెనక ఆంతర్యం ఏమిటో బహిర్గతంగా తెలుస్తుంది. గిరిజనులు నిర్మించుకునే నిర్మాణాలకు మాత్రం పత్రాలు తీసుకురమ్మని తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం పాడేరు పట్టణంలో అనావాయితీగా మారింది. అదే గిరిజనేతరులు బినామీలను ఏర్పాటు చేసుకొని గృహ వాణిజ్య నిర్మాణాలు చేపడితే ఎలాంటి పత్రాలు అవసరం లేదు. ఎందుకంటే అధిక మొత్తంలో పంచాయతీ రెవెన్యూ అధికారుల చేతులు మారడం గమనార్హం. ఇటీవల కాలంలో అన్ని శాఖల కలిపి రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు మధ్య నుండి ఇరువైపులా కొన్ని అడుగుల దూరం కొలిచి ఇది ఆర్ ఎం బి స్థలం ఆధీనంలో ఉందని బహిర్గతంగా చెప్పి ఇప్పుడు మాత్రం మెయిన్ రోడ్ లో నిర్మిస్తున్న నిర్మాణాలకు జిరాయితీ భూములని రెవెన్యూ అధికారులు చెప్పడం చాలా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. గిరిజన ప్రాంతంలో గిరిజనుల చట్టాలు హక్కులను కాపాడాల్సిన అధికారులే కాసులకు కక్కుర్తి పడి బినామిలకు సహకరిస్తే గిరిజన చట్టాలను తూట్లు పొడుస్తున్నట్లు లెక్క కాదా..? అని గిరిజన ప్రాంత గిరిజన మేధావులు గిరిజనులు ముక్కున వేలేసు కుంటున్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజన హక్కులు చట్టాలపై పోరాటం చేసే గిరిజన సంఘాలు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడంపై గిరిజనేతరులకు గిరిజనులు చులకన కాదా..? గిరిజన బినామీల వల్ల గిరిజన హక్కులు చట్టాలకు భంగం కలుగుతున్న గిరిజన సంఘాలు మాట్లాడకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ పంచాయతీ అధికారులు నిద్రమత్తు వీడి నూతనంగా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయాలపై అలాగే అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోగలరని గిరిజన ప్రాంత గిరిజన మేధావులు గిరిజనులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తారో..! లేదో వేచి చూద్దాం.

పోలవరం ముంపు సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- రామవరం గ్రామ పంచాయతీ పోలవరం నిర్వాసితుల ఆందోళన
- అఖిలపక్షం ఆధ్వర్యంలో 15న ఐటీడీఏ ముట్టడి, భారీ నిరసన
- క్రిస్టియన్ మైనారిటీ మండల అధ్యక్షునిగా సత్యనారాయణ
- సత్యనారాయణ నియామకం సంతోషకరం

విశాలాంధ్ర-చింతపల్లి : వైఎస్ఆర్సిపి మండల క్రిస్టియన్ మైనారిటీ మండల అధ్యక్షునిగా కొర్ర, సత్యనారాయణను ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించడం సంతోష కరమని బలపం సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఈ నియామకంతో మరోమారు రుజువైందన్నారు. క్రిస్టియన్ మైనారిటీ మండల అధ్యక్షునిగా నియమితులైన సత్యనారాయణ మాట్లాడుతూపార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్రిస్టియన్ మైనారిటీ సంఘ సంక్షేమంతో పాటు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా తనను నియమించిన పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, నా నియామకానికి కృషి చేసిన వైసిపి అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు గుమ్మ తనూజ రాణి, అల్లూరి జిల్లా అధ్యక్షులు పాడేరు శాసనసభ్యుడు మత్యరాస విశ్వేశ్వర రాజు లతోపాటు బలపం సర్పంచ్ రమేష్ నాయుడు, ఎంపీపీ కుమారి కోరాబు అనూష దేవి, జడ్పీటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, పార్టీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాంగి గణబాబు, వనగల బెన్నిబాబు సహా అరకు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శిథిలావస్థలో సొవ్వ అంగన్వాడీ కేంద్రం

ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

విశాలాంధ్ర-డుంబ్రిగుడ : మండలంలోని సోవ్వ పంచాయితీ కేంద్రంలో పూర్తిగా శిథిలవస్థలో అంగన్వాడి కేంద్రం చేరింది. దీంతో అంగన్వాడికి వచ్చే చిన్నారులు పలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గత్యంతరం లేక అంగన్వాడీ టీచర్ నివాస గృహంలోనే చిన్నారులు వస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడి కేంద్రం శిథిలావస్థలో చేరి కొన్ని సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు మరమ్మత్తులు గాని, నూతన అంగన్వాడి భవనం నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు. అంగన్వాడి కేంద్రంలో ఆటపాటలతో, చదువు నేర్చుకోవాల్సిన చిన్నారులు అంగన్వాడి భవనం లేక ఇబ్బందులు పడవలసిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయంపై అధికారులు స్పందించి శిథిలవస్తులో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని మరమ్మత్తులు చేయించాలని, లేదా నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వితంతు పెన్షన్ మంజూరు చేయండి : గెమ్మెల రాజమ్మ ఆవేదన

విశాలాంధ్ర-జికె వీధి : గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ మర్రిపాలెం గ్రామానికి చెందిన గెమ్మల రాజమ్మ భర్త గోవిందరావు మరణించి సంవత్సరం అవుతుందని వితంతు పెన్షన్ కోసం సచివాలయంలో ఎన్నో దరఖాస్తులు పెట్టుకున్న ఇప్పటికీ వితంతు పెన్షన్ మంజూరు కాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ వితంతు పెన్షన్ రాక కుటుంబ పోషణ భారమైందని జనసేన పార్టీ నాయకులు వద్ద ఆమె ఆవేదన వెల్లబుచ్చింది. వితంతువు పెన్షన్ మంజూరుకు సంబంధిత అధికారులతో మాట్లాడి పెన్షన్ మంజూరు అయ్యేవిధంగా బాధ్యత తీసుకుంటామని రాజమ్మకు జనసేన పార్టీ నాయకులు, జనసేన పార్టీ పంచాయతీ ప్రధాన కార్యదర్శి, పీసా మండల కార్యదర్శి, నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం మండల అధ్యక్షుడు గబులంగి గణేష్, కొయ్యం ఇమ్మానియేల్ ఆమెను భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కోసధికారి సాగిన బ్రహ్మాజీ పదాల్, గెమ్మెల యేసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డున పడ్డ గిరిజన గురుకుల ఉపాధ్యాయులు

గిరిజన గురుకుల ఉపాధ్యాయుల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనాయక్

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన గురుకుల పాఠశాలలో సుమారుగా 15 నుండి 20 సంవత్సరాలు విద్యార్థిని విద్యార్థులకు విద్యని అభ్యాసించిన ఉపాధ్యాయులకు మెగా డిఎస్సి ద్వారా అన్యాయం జరిగిందని గిరిజన గురుకుల ఉపాధ్యాయుల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నాయక్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున నాయక్ అన్నారు. ఆదివారం అల్లూరి జిల్లా పాడేరు కేంద్రం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1143 మంది మెగాడిఎస్సి వల్ల రోడ్డున పడాల్సిన పరిస్థితి నేడు వచ్చిందని, దీనిపై ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని ఆయన అన్నారు. ఈ మెగా డీఎస్సీ వల్ల 15 నుండి 20 సంవత్సరాలు పనిచేసిన గిరిజన గురుకుల ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు.

25లోపు రైతులు పంట నమోదు చేసుకోవాలి

మండల వ్యవసాయ అధికారి గిరిబాబు

విశాలాంధ్ర-జికె వీధి: గూడెం కొత్త వీధి మండలంలో పంట నమోదు ప్రక్రియలో భాగంగా మండలలో 12412.5 ఎకరాల్లో రైతులు పంటలు వేయడం జరిగిందనీ మండల వ్యవసాయ అధికారి డిగిరి బాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇంతవరకు 9519 ఎకరాల్లో 6638 రైతులు పంట నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన 2894 ఎకరాలు బాలన్స్ ఉందనీ ఆయన అన్నారు. ఉద్యాన పంటలు 5600ఎకరాల్లో నమోదు జరిగిందనీ వారన్నారు.ఈ పంట నమోదు వల్ల రైతులుకు పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగిన ప్రభుత్వం నుండి వచ్చే ఇన్పుట్ సబ్సిడీ వంటి వాటికి అర్హులు అవుతారన్నారు. ఇప్పటికైనా మిగిలిన రైతులు ఈనెల 25లోపు పంట నమోదు చేసుకోవలసిందిగా మండల వ్యవసాయ అధికారం డి. గిరిబాబు తెలియజేసారు.

నకిలీ మద్యం విక్రయాలపై నేడు వైసీపీ ఆందోళన

విశాలాంధ్ర-అరకులోయ : రాష్ట్రంలో హెచ్చు మీరిన నకిలీ మద్యం విక్రయాలకు వ్యతిరేకంగా ఈనెల 13వ తేదీ సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో అరకులోయ నియోజకవర్గ కేంద్రంలో ఆందోళన కార్యక్రమం చేపడుతున్నట్లు జెడ్పిటిసి సభ్యురాలు శెట్టి రోషిని, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగం చాణిక్య తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడికక్కడ నకిలి మద్యం విక్రయాలు హచ్చుమీరీ మందు బాబుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న అన్నారు. నకిలీ మద్యం వలన అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయని కుటుంబ పెద్ద నకిలీ మద్యంతో ఆసుపత్రుల పాలవుతూ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై కూటమి ప్రభుత్వ కళ్ళు తెరిపించేందుకు వైసిపి నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలతో సిద్ధపడిందన్నారు. వైసీపీ అధిష్టానం పిలుపుమేరకు సోమవారం ఉదయం 10 గంటలకు అరకు సమీపంలోని ఎండపల్లి వలస గ్రామం వద్ద ఉన్న ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పిటిసిలు,ఎంపీపీలు, సర్పంచులు, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు కమిడీ అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు స్వాబి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేద్దాం

మోతుగూడెం, కొత్తపల్లి గ్రామ పంచాయితీల సభలో జమాల్‌ఖాన్ వెల్లడి

విశాలాంధ్ర-మోతుగూడెం : ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి,మఠం విజయభాస్కర్ ఆదేశాల మేరకు ఆదివారం కొత్తపల్లి, మోతుగూడెం గ్రామ పంచాయతీల గ్రామ సభలు నిర్వహించారు. కరణం శ్రీనివాస్, కరణం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో కొత్తపల్లి పంచాయతీ పరిధిలో సమస్యలను ప్రజలు సభ దృష్టికి తీసుకువచ్చారు. టిడిపి గుంపు నుండి సచివాలయం వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని. కొత్తపల్లి నుండి వేముల రాయి, నేలకోట గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేయాలని, కొత్తపల్లి గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేయాలని, మెట్ల రేవు మెట్లు ఏర్పాటు చేయాలని, 150 ఇళ్లు ఉన్న గుంపులో వాటర్ ట్యాంకునుండి నీరు అందడం లేదని సోలార్ ట్యాంకు ఏర్పాటు చేసి నీళ్లు అందించాలన్నారు. అలాగే గ్రామంలో రెండు బోర్లు ఏర్పాటు చేయాలని సుకుమామిడిలో ఒక బోరు, గొంది గూడెం లో ఒక బోరు, మొత్తం నాలుగు బోర్లను ఏర్పాటు చేయాలని త్రాగునీటి సమస్య వేసవిలో తీవ్రంగా ఉంటుందని గ్రామస్తులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే మోతుగూడెం గ్రామంలో పంచాయతీ కార్యాలయం పక్కన నివాసముంటున్న 40 కుటుంబాల వారికి ఒక బోరు ఏర్పాటు చేయాలని, గ్రామంలో మరో మూడు చోట్ల కూడా త్రాగునీటి ఎద్దడి ఉన్నందున మొత్తం నాలుగు బోర్లు అవసరం ఉందని గ్రామస్తులు తెలిపారు. కొత్తపల్లి గ్రామంలో ఉన్న గ్రంథాలయానికి పుస్తకాలను ఏర్పాటు చేయాలని దానితో యువకులు పోటీ పరీక్షలకు ఉపయోగపడుతుందన్నారు. సమస్యల పట్ల అధ్యక్షులు జమాల్ ఖాన్ స్పందిస్తూ వేముల రాయి నేలకోట గ్రామాలకు రోడ్లు మంజూరు అయినాయి కానీ ఫారెస్ట్ వారు అనుమతులు లభించకపోవడంతో నిలిచిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు తీసుకువచ్చి రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. త్రాగునీటి సమస్య ఉన్న వీధుల్లో బోరు పంపులు ఏర్పాటుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఒక పది రోజుల్లో పనులుచేపడతానన్నారు. అనంతరం కొత్తపల్లి గ్రామ యువకులు జమాల్ ఖాన్ ను తమ గ్రామానికి వచ్చినందుకు అభిమానంగా శాలువాను కప్పి సన్మానించారు. జమాల్ ఖాన్ గ్రామంలో చురుకుగా వ్యవహరిస్తున్న కరణం కోటేశ్వరరావు, జల్లి కామేష్, మీడియం రెడ్డిలను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు ఎండి జహంగీర్, ఎంపీటీసీ వేగి చిన్న, క్లస్టర్ ఇంచార్జ్ ఓబులనేని నరసింహారావు చౌదరి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు తుర్రం ముత్తయ్య, కార్యదర్శి అనిగి చంద్రయ్య, మాజీ సర్పంచ్ కరణం లక్ష్మణ్, మహిళా మండల అధ్యక్షురాలు నాగ మంగ వేణి, వి సాల్మన్ రాజు, ఎస్ కే జానీ, గ్రామ కమిటీ అధ్యక్షులు పైదాసుబ్బయ్య, కార్యదర్శి రమణారెడ్డి, జాఫర్, రియాజ్, ఉలయ్య, మాజీ ఎంపీటీసీ సుశీల, హరిణి, కరణం వెంకటేశ్వర్లు, రామచంద్రరావు. బొద్దెల ముత్తయ్య. ధూబి లక్ష్మణ్, పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విజయదశమి శతజయంతి వేడుక

విశాలాంధ్ర-చింతూరు : డాక్టర్ కేశవరావు బాలీరామ్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని 1925లో విజయదశమి పర్వదినాన స్థాపించారు. సమరతతో కూడిన సంఘటిత భారతదేశ నిర్మాణంలో నిమగ్నమైన సంఘం, ఈ విజయదశమికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకుగాను చింతూరు ఉప మండలంలో సంత పాకాల క్రీడా ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెద్దఎత్తున స్వయం సేవకులు,సేవకురాళ్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమం ముందు ముందు ఎన్నో జరగాలి అని పాల్గొన్న వాళ్ళు హర్షం వ్యక్తం చేశారు.

చింతగ్రీన్ ఎనర్జీ సంస్థకు వెంగళరాయ, తోటపల్లి నీరు కేటాయింపు ప్రతిపాదనలు వెనక్కు తీసుకోవాలి

గిరిజన ప్రాంతాల్లో పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ అనుమతులు రద్దు చేయాలి : సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర-మక్కువ : మండలం దుగ్గేరు వద్ద చింత గ్రీన్ ఎనర్జీ సంస్థకు పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ కోసం వెంగళరావు సాగర్ ప్రాజెక్టు, తోటపల్లి ప్రాజెక్ట్‌లు నుండి 24ఎంసిఎం నీటిని కేటాయింపులకు మంత్రి మండలి ప్రతిపాదనలు చేసినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలపై సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వై నాయుడు ఆధ్వర్యంలో మక్కువలో పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడడం జరిగింది ఈ సందర్భంగా కొల్లు గంగునాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దుగ్గేరు వద్ద పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ కోసం వెంగళరావు సాగర్ నుండి తోటపల్లి ప్రాజెక్టు నుండి 24 ఎం.సి.యం వాటర్ ను కేటాయిస్తున్నట్లు ప్రతిపాదనలు చేయడం అన్యాయమని అన్నారు ఎందుకంటే ఇప్పటికే తోటపల్లి గాని వెంగళరావు సాగర్ గాని జంగావతి ప్రాజెక్టుల్లో గాని స్థిరీకరించిన ఆయికట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని అన్నారు తోటపల్లిలో ప్రధాన కాలువకి చివరి వరకు నీరు వెళ్లడం లేదని ఇంకా పిల్ల కాలువలు అనేకం తవ్వడం లేదని లక్ష 80 వేల ఎకరాలకు స్థిరీకరించిన తోటపల్లి ఆయకట్టు 60 వేల ఎకరాలు చివరి భూములకు ఇంకా సాగునీరు అందడం లేదని అన్నారు అలాగే వెంగళరావు సాగర్ ప్రాజెక్టు 24 వేల ఏడు వందలు ఎకరాలకు స్థిరీకరించిన ఆయకట్టు ఉందని ఆదనపు ఆయకట్టు బొబ్బిలి ప్రాంతంలో 5000 ఎకరాలకు నీరు ఇస్తామని చెప్పి పనులు మంజూరు చేసి కొన్ని పనులు చేశారని కానీ ఇప్పటివరకు చివరి భూములకు నీరు వెళ్లడం లేదని అన్నారు. తోటపల్లి ప్రాజెక్టులో ఎడమ ప్రధాన కాలువలో పాలకొండ ప్రాంతముకు సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఆందోళనలు చేస్తున్నారని అన్నారు వెంగళరావు సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎల్బీసీ గాని ఆర్బిసి గాని కాలువల పరిధిలో నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని ఆర్ఎంసి పరిధిలో చివరి భూములకు 4 వేల ఎకరాల కు నీరు అందడం లేదని అన్నారు ఉన్న 24700 ఎకరాల్లో 15వేల ఎకరాలు దాటి సాగునీరు ఇవ్వడం లేదని మరొక ఐదు వేల ఎకరాల ఆదనపు ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని ఉన్న ఇంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టులు నుండి కార్పొరేట్ పెట్టుబడుదారులకు సాగునీరు ఇవ్వడానికి కూటమిప్రభుత్వం ఉత్సాహం చూపిస్తుంది తప్ప రైతుల భూములకు సాగునీరు అందించడానికి చొరవ చేయడం లేదని అన్నారు అలాగే దుగ్గేరు ప్రాంతంలో గిరిజనులు తరతరాలుగా జీవనం సాగిస్తున్నారని ఇంతవరకు దుగ్గేరు ప్రాంతంలో పంపుడ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ పెడుతున్నట్లు గ్రామ సభలు జరపడం గాని ప్రజలకు తెలియజేయడం గాని జరగడం లేదని రహస్యంగా సర్వేలు చేసి పంపుడు స్టోరేజీలు పేరుతో గిరిజన ప్రాంతం మొత్తాన్ని కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పజెప్పడానికి చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ సిద్ధపడ్డారని అన్నారు పవన్ కళ్యాణ్ దుగ్గేరు ప్రాంతానికి వచ్చేనాటికే పంపుడ్ స్టోరేజీ పవర్ ప్లాంట్ ప్రతిపాదనలు ఉన్నాయేమో అని అనుమానం వస్తుందని అందుకే ఈ ప్రాంతాన్ని పరిశీలన చేయాడనీకే వచ్చారని అనుమానం వస్తుందని కాబట్టి ఈ ప్రాంతానికి చెందిన స్థానిక మంత్రి గుమ్మడి సంధ్యారాణి సొంత గడ్డ పై గిరిజనులకు అన్యాయం జరుగుతుందని, రైతులు భూములుకు శాశ్వతంగా నీరు అందకుండా వుండే ప్రతిపాదనలు ప్రభుత్వం చేస్తుందని దీనిపై మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందించాలని గిరిజనులకు, రైతులకు వాస్తవాలు తెలియ చేయాలనీ,వెంగలరాయ, తోట పల్లి ప్రాజెక్టులు చివరి భూములకు నీరు అందేవిధంగా పనులు చేయించాలని డిమాండు చేశారు మంత్రి చొరవచేసి వెంటనే వెంగళరాయ తోటపల్లి ప్రాజెక్టులు నుంచి చింత గ్రీన్ ఎనర్జీ సంస్థకు పంపుడు స్టోరేజ్ కి నీరు ఇవ్వడానికి చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వం వెనక్కు తీసుకోనే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు అలాగే దుగ్గేరు ప్రాంతంలో పంపుడ్ స్టోరేజీ కోసం పెట్టిన ప్రాంతాన్ని ఎక్కడ పెట్టారు ఎలా పెడుతున్నారో ఆ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు తెలియపరచాలని లేకపోతే అటు గిరిజనులను ఇటు రైతులను కదిలించి రైతుల ప్రయోజనాలు కాపాడే దానికి ప్రజాసంఘాలు, అన్ని పక్షాలను కలుపుకొని సిపిఎం పార్టీగా పోరాడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో సీపీఎం పార్టీ మండల కమిటీ సభ్యులు అల్లు ఆదినారాయణ పాల్గొన్నారు.

ఛలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

ఆదివాసీ యువసేన సభ్యులు సంఘీభావం

విశాలాంధ్ర-మారేడుమిల్లి : 13వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, రంపచోడవరం ఐటీడీఏ ముందు జరిగే ర్యాలీ మరియు ముట్టడి కార్యక్రమానికి అభ్యుదయ వాదులందరు తరలి రావాలని యువసేన అధ్యక్షులు సుంకరి అప్పారావు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నెంబర్ 3 బదులుగా మరో కొత్త జీవో ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగులకు 100 శాతం ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని, తక్షణమే ట్రైబల్ అడ్వైజర్ కౌన్సిల్ ద్వారా తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాలు చట్టం ప్రకటించాలని, ఆదివాసీ నిరుద్యోగులకు 2025 జనరల్ డిఎస్సిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కావున తక్షణమే ఆదివాసి నిరుద్యోగులు కొరకు ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని, షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలైన 1/59,1/70 చట్టం, పెసా చట్టం, 2013 పోలవరం భూ సేకరణ చట్టం మొదలైన చట్టాలు పట్టిష్టంగాఅమలు చేయాలని ఈనెల 13 వ తేదీన రంపచోడవరం ఐటిడిఏ నందు ధర్నా, ర్యాలీ కార్యక్రమం శాంతియుతంగా జరగబోయే నిరసనకు అందరూ తప్పనిసరిగా వచ్చి ఆదివాసీల హక్కులు చట్టాలు పరిరక్షణ కోసం అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయకులు గరిడె బాబూరావు యూత్ సభ్యులు కలుముల రాంబాబు దొర,నేదూరి ఓవేల్ రాజు, మడి బద్రి దొర,గొర్లె బాను బాబు, ఎరుపోతు చిట్టిబాబు, కోండ్ల అబ్బాయి రెడ్డి కోసు ప్రశాంత్ దొర మిగిలిన సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలపై ఆర్థిక భారం పడకూడదన్నదే కూటమి ప్రభుత్వాల సంకల్పం

టిడిపి చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనంద్

విశాలాంధ్ర- చింతపల్లి : ప్రజలపై ఆర్థిక భారం తగ్గించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ 2.0 కార్యక్రమం ప్రతి ఒక్కరికి వరమని తెలుగుదేశం పార్టీ చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ అన్నారు. తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు గడప రాయి గ్రామంలో ఆ గ్రామస్తుడు కొర్ర సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి, వ్యవసాయ, ఇతర రంగాల కుటుంబాలపై ఆర్థిక బారం తగ్గించడం కోసం, వ్యవసాయ రంగానికి సంబంధించిన ట్రాక్టర్లు, టిల్లర్, రైస్ మిల్లులు, వ్యవసాయ డ్రోన్లు తదితర పనిముట్లు, నిత్యవసర వస్తువులు, మార్కెట్ యార్డ్ సంతలకు సరుకు రవాణా, ఆరోగ్య ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు తదితర వాటిపై సూపర్ జీఎస్టీ 2.0లో అన్ని రంగాలవారికి ఆర్థిక భారాన్ని భారీగా తగ్గించిందన్నారు. ఇటువంటి బృహత్తర నిర్ణయాలు తీసుకోవడం కేవలం కూటమి ప్రభుత్వం వల్లనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి అరుగుల అనిల్ కుమార్, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ జనరల్ సెక్రెటరీ చిన్న ఖాసిం వలి, కోశాధికారి కిముడు అప్పారావు, గాంధీ వడాల్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రామవరంలో 104, అడవి వెంకన్నగూడెంలో 14 కుటుంబాలకు పేపర్ నోటిఫికేషన్ ఇవ్వాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం. : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజక వర్గం మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పోలవరం నిర్వాసితులు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆదివారం సోములగూడెం గ్రామంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై అఖిలపక్షంగా ఏర్పడి పోలవరం ముంపు సమస్యలు తక్షణమే పరిష్కరించాలి అనే పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పోలవరం ప్రాజెక్టు కా పర్ డ్యామ్ బ్యాక్ వాటర్ కారణంగా ప్రతి సంవత్సరం జులై నుండి అక్టోబర్ వరకు మన భూములన్నీ వరద నీటిలో మునిగిపోయి ఉండటం కారణంగా మనం వ్యవసాయం చేసుకునే సమయం సరిపోవడం లేదని, పేదవారికి కూలీ పని చేసుకోవడానికి కూలీ పనులు దొరకక పొట్ట గడవడం కష్టంగా ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం రహదారి సౌకర్యం నాలుగు నెలలు పాటు బ్యాక్ వాటర్ కారణంగా నాలుగు మండలాలు వి.ఆర్ పురం. కూనవరం. చింతూరు, ఎటపాక మండలంలో రహదారులపై నీరు చేరి నెలలు తరబడి నీరు ఉండటంతో విద్యార్థులు పాఠశాలలకు, హాస్పిటల్‌కి వెళ్లలేని పరిస్థితి కనీసం ఉపాధ్యాయులు కనీసం పాఠశాల కు వచ్చే మార్గం లేదని నిర్వాసిత గ్రామాల ప్రజలకి రహదారులు లేనప్పుడు ప్రాణాపాయ జబ్బులు వచ్చిన వారిని తరలించడానికి మార్గంలేని కారణంగా వారు గ్రామాల్లో నే మరణిస్తున్న పరిస్థితి. చివరికి చిన్నచిన్న జబ్బులు సైతం జఠిలమై పోతున్నాయి. ప్రాజెక్టు మొదలుపెట్టి దాదాపు 17 నుండి 18 సంవత్సరాలు గడుస్తున్నా కనీసం ప్రజల కొరకు ప్రతిపక్షం అయిన అధికార పక్షం అయిన వారి వారి స్వార్థాలే చూసుకుంటున్నారన్నారు. ప్రాజెక్టు మొదలు పెట్టిన నాటి నుంచి ఏ ప్రభుత్వాలు నిర్వాసితుల గోడు పటించుకోవడం లేదనీ , పోలవరం ముంపు ప్రాంతాల పేరుతో ప్రభుత్వ పథకాలు వర్తింప చేయడం లేదన్నారు. ముంపు గ్రామాల ప్రజలు కనీసం వ్యవసాయం చేసుకోవడానికి వీలులేకుండా వ్యవసాయానికి ఉపయోగపడే ఎరువులు సరఫరా నిలిపివేసిందనీ. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం వర్తింప చేయడం లేదు.ప్రభుత్వం వారు మా పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చి మమ్మలను ఇక్కడ నుంచి పునరావాస కాలనీకి తరలించాలని అన్నారు. వరద ముంపులో అవస్థలు పడుతున్నా మా ముంపు గ్రామాలకు ప్రభుత్వం నుంచి తగిన న్యాయం జరగాలని ప్రజల రోదన ఏ ప్రభుత్వాలు వినడం లేదని ప్రజల గోడు ప్రజాప్రతినిధులు వినాలని కోరుతున్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల నష్టపోతున్న నిర్వాసితుల డిమాండ్స్ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ఇప్పుడున్న రేట్లకి అనుగుణంగా 10 లక్షలు పెంచాలి. రామవరం గ్రామ పంచాయతీ రామవరం గ్రామంలో 104, అడవి వెంకన్నగూడెంలో 14 ఇళ్లకు పేపర్ నోటిఫికేషన్ ఇవ్వాలి. ఆర్ అండ్ ఆర్, స్ట్రక్చర్ వ్యాల్యూ వన్ టైం సెటిల్మెంట్ చేసి తరలించాలి.నిర్వాసిత గ్రామాల్లో కాటప్ డేట్ తో సంబంధం లేకుండా ప్రభుత్వం తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యూవత యూవకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం డి

పారం పట్టా భూములకు 10 లక్షలు 80 వేల రూపాయలు ఇవ్వాలి.నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి 5 సెంట్లు నుండి 10 సెంట్లకు పెంచి నిర్మాణం చేపట్టాలి. భూమి లేని నిర్వాసిత కుటుంబానికి చదువుకున్న యూవతి యూవకులకు ఉద్యోగం కల్పించాలి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితులను తరలించే విషయంలో నిర్దిష్టమైన హామీ ప్రకటించాలి.పోలవరం నిర్వాసిత పునరావాస కాలనిలో 27 రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలి.చదువుకున్నయు వతి యు వకులకు నైపుణ్యం అభివృద్ధి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలి.నిర్వాసిత కుటుంబాలను ఏ ప్రాంతంలో తరలిస్తున్నారో ఆ ప్రాంతంలో స్థానికత కల్పించాలి.ముంపు గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ గ్రామాలను తరలించే వరకు అభివృద్ధి పనులు చేపట్టాలి. ఈ సమస్యలపై ప్రతి ఒక నిర్వాసితులు 15 తేదీ బుధవారం నాడు చింతూరు ఐటీడీఏ ముట్టడి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయవలిసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామ పంచాయతీ అఖిలపక్ష నాయకులు పోలవరం నిర్వాసిత కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు శాపంగా మారుతున్న ఎంపీడీవో నిర్లక్ష్య వైఖరి

- అభివృద్ధి సంక్షేమాలతో పాటు జీఎస్టీ సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో వైఫల్యం చెందుతున్న ఎంపీడీవో
- టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆనంద్

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీతామహాలక్ష్మి నిర్లక్ష్య వైఖరి వీడి ప్రజలకు ప్రభుత్వం కల్పిస్తున్న అభివృద్ధి, సంక్షేమాలతో పాటు నిత్యవసర సరుకులపై ఇచ్చిన జీఎస్టీ తగ్గింపు ధరలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కృషి చేయాలని టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా నిత్యవసర సరుకులపై జీఎస్టిని బాగా తగ్గించిందన్నారు. దీంతో ధరలన్నీ దిగి వచ్చాయన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. గ్రామ సభలను సైతం తూతూమంత్రంగా నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శులను ఆమెకు అనుకూలంగా మలుచుకుని ప్రభుత్వ పథకాలను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నిత్యం ప్రజలకు అవసరమయ్యే పాలు, పెరుగు దగ్గర్నుంచి అన్ని నిత్యవసర సరుకులపై ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ తగ్గింపు ధరలను ప్రజల్లోకి తీసుకెళ్ళలేని నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తున్న స్థానిక పంచాయతీ కార్యదర్శి సహ సచివాలయ సిబ్బంది పై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. జీఎస్టీ అమల్లోకి వచ్చి గత కొన్ని రోజులైనా దానిపై గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించక పోవడాన్ని వారు తప్పుపట్టారు. కూటమి ప్రభుత్వంలో పనిచేస్తూ వైసిపి ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులొత్తుతున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి సహ సచివాలయ సిబ్బందిపై చర్యలు చేపట్టేందుకు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. తక్షణమే దీనిపై తగు చర్యలు తీసుకొనకపోతే ప్రజలకు నిత్యవసర వస్తువులపై న్యాయం జరిగే పరిస్థితిని కోల్పోతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ పై అవగాహన కల్పిస్తూ ఏ వ్యాపారస్తుని దుకాణంలోనూ నోటీసు అందించిన దాఖలాలు లేవన్నారు. అధికారులే నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉద్యోగులు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమాలను చేరువ చేయడంలో ఉదాశీన వైఖరి ప్రదర్శించడం వలన ప్రజలు అన్నివిధాలా నష్టపోయే పరిస్థితి ఉంటుందని ఇది ప్రభుత్వానికి నష్టం కలిగించేది కావడం పార్టీపరంగా తాము సహించబోమని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

హెచ్ఐవి వ్యాధిపట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ పదకం సూపర్వైజర్ రమణ

విశాలాంధ్ర-చింతపల్లి : హెచ్ఐవి వ్యాధిపట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ డి రమణ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ పధకం లింక్ వర్కర్ పి.పార్వతి ఆధ్వర్యంలో మండలంలోని తాజంగి గ్రామంలో" హెచ్ఐవి వ్యాధిపట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ హెచ్.ఐ.వి స్థితిని తెలుసుకొని ఆ వ్యాధిపట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీధర్ మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న హెచ్.ఐ.వి వ్యాధిగ్రస్థుల పట్ల వివిక్షత చూపకుండా వారికి సహాయ, సహకారాలు అందించాలని ప్రభుత్వ పథకాల్లో వారికి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఐ.సీ.టి.సి, ఎ.ఆర్.టి. యెస్.టి.ఐ సెంటర్స్ సర్వీసెస్ గురించి వివరించారు. లింక్ వర్కర్ పి. పార్వతి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు రక్త పరీక్షలు చేసుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి వినియోగం, నియంత్రణ విషయంలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి : సర్పంచ్ పుష్పలత

విశాలాంధ్ర-చింతపల్లి : నీటి వినియోగం, నియంత్రణ విషయంలో ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రతిరోజు వీధి, ఇంటింటి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కుళాయిలకు అమర్చిన ట్యాప్ లతో నీరు వృధా కాకుండా నియంత్రించే అవకాశం ఉందన్నారు. అటువంటి ట్యాప్ లను ప్రజలు ఒక్కరోజులోనే పీకి పారేసి నీటిని వృధాగా పోతుందని ప్రచారం చేస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులుగా తాము ప్రజలకు చేసే సేవను అపహాస్యం చేసే విధంగా వ్యవహరించడం ప్రజలకు, ప్రతిపక్షాలకు తగదని ఈ సందర్భంగా ఆమె హితవు పలికారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలు తమతో సహకరించి నీటి సమస్య పరిష్కారానికి, వృధాగా పోయే నీరు నియంత్రించేందుకు కృషి చేస్తున్న తమ ప్రయత్నానికి సహకరించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-చింతపల్లి : బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.జయభారతి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం ను పురస్కరించుకొని మండలంలోని లంబసింగి గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలికలు) లో బాలికల సంరక్షణ - బాల్య వివాహాల వలన జరిగే నష్టాలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలలో శారీరకంగా, మానసికం గా వచ్చే సమస్యల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై కూడా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.అదే విధంగా విద్యార్థులు విద్య పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు.ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రణాళిక బద్ధంగా కృషి చేసినప్పుడే అది సాధ్య పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం సింహాచలం, కే రమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్., కుమారి, బి భవానితో పాటు, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

టిడిపి శ్రేణులకు పిలుపునిచ్చిన ఆ పార్టీ పాడేరు ఇన్చార్జి ఈశ్వరి

విశాలాంధ్ర-చింతపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. చింతపల్లిలోని తెలుగుదేశం పార్టీ మండల కార్యకర్తల అత్యవసర సమావేశం పార్టీ మండల అధ్యక్షులు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజనుల పక్షాన పని చేస్తూ వారి పురోభివృద్ధి కోసం నిరంతరం పరితపిస్తున్న విషయాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రహదారులు లేని పల్లెలకు కూడా రోడ్లు నిర్మించి డోలి రహిత ఆదివాసి ప్రాంత నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, యువనాయకులు లోకేష్ చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త పై ఉందన్నారు. ప్రభుత్వం ఆదివాసీల ఆర్థిక పురోభివృద్ధి మౌలిక వసతుల కల్పన కోసం ఎంతో చేస్తున్న విషయం ప్రజలకు తెలియజేయడంలో ఏ ఒక్కరూ వైఫల్యం చందరాదన్నారు. గిరిజన ప్రాంతంలో ఎవరికైనా ఇల్లు ఇచ్చినా, నీళ్లు ఇచ్చినా, పెన్షన్ ఇచ్చినా ఏదైనా తెలుగుదేశం పార్టీ హయాంలో నారా చంద్రబాబునాయుడు, స్వర్గీయ నందమూరి తారక రామారావుల ఆధ్వర్యంలోనే జరిగిందనే విషయం ప్రజలకు తెలియ జేయాలన్నారు. మొట్టమొదటిసారి గిరిజనులకు సొంత ఇంటి కలలు నెరవేర్చింది స్వర్గీయ ఎన్టీ రామారావు గారని, ఆ తర్వాత గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేసింది చంద్రబాబునాయుడు అన్నారు. చేసే పనిని చెప్పుకోవడంలో వైఫల్యం చెందకూడదని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం ప్రభుత్వం చేసిన మంచి పనిని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని చెప్పారు. చేసే మంచి పనిని చెప్పి స్థానిక సంస్థల ఎన్నికల్లో మద్దతు లభించేలా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా 17 పంచాయతీల నుంచి నూతనంగా నియమితులైన గ్రామ కమిటీ అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిల్లో పూర్ణచ్చందరావు, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కిల్లో ఊర్మిళ, పీఏసీఎస్ చెర్మన్ గెమ్మెలి అబ్బాయి నాయుడు, సీనియర్ నాయకులు చల్లంగి లక్ష్మణరావు, జ్ఞానేశ్వరి, 17 పంచాయితీల గ్రామ కమిటీ అధ్యక్షులు, గ్రామ స్థాయి, మండల స్థాయి అనుబంధ కమిటిలు, క్లస్టర్, యూనిట్, బూత్, ఇంచార్జ్ లు, మరియు కెఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

17న చలో పాడేరు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-అరకులోయ : హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు జీవోల జారీపై ప్రభుత్వ పాలకులు, ప్రతినిధులు ఉన్నతాధికారులు చేస్తున్న తప్పుడు ప్రకటనలపై ఆదివాసి గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ తేదీన ఈనెల 17వ తేదీన తలపెట్టిన చలో పాడేరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా మన్య ప్రాంతాలలో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలకు ప్రభుత్వం 2,13,51 జీవోలు జారీ చేసిందని అయితే ఇటీవల పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్య రాణి హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ఘటన జరిగి కొద్ది రోజులు గడవకముందే మరో 10 రోజుల్లో సీలేరులో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు పూజ కార్యక్రమాలు చేయడానికి బడా కంపెనీ ప్రతినిధులతో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటులకు సన్నద్ధం అవడం చాలా దురదృష్టకరమన్నారు. రాజకీయ నాయకుల మాటల్లో వాస్తవాలు ఉండవని నాలుక ఎటు తిరిగితే అటు మాట్లాడడమే వారికి వచ్చునన్న సంఘటనలకు ఇదే నిదర్శనమని ఆయన మండి పడ్డారు. ఒకపక్క ప్రాజెక్టు పనులు తాత్కాలికంగా నిలిపివేస్తామని ప్రకటిస్తూనే లోపాయి కారికంగా ప్రాజెక్టు నిర్మాణాలకు పూజలు జరిపించడానికి సన్నద్ధం కావడం ఆదివాసి ప్రజలను దగాకు గురి చేయడమేనని ఆయన మండిపడ్డారు. దీనిపై గిరిజనులంతా ఇప్పటికే అనేక ఆందోళన కార్యక్రమాలు నిరసనలు తెలియజేశారని ఆయన అన్నారు. 2,13,51 ఒప్పందాల జీవోను ప్రభుత్వం రద్దు చేసెంతవరకు తమ పోరాటం ఆగదని ఈ జీవోలను రద్దు చేయాలన్న డిమాండ్తో ఈనెల 17న తలపెట్టిన చలో పాడేరు కలెక్టరేట్ కార్యక్రమంలో ఆదివాసి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ గళం విప్పి నిరసన తెలియజేసి ప్రభుత్వానికి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కొండలరావు, దశరథ్, సురేష్, కుమారస్వామి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా శ్రమ దానం

విశాలాంధ్ర-ఎటపాక : స్వచ్ఛందంగా శ్రమ దానం కార్యక్రమం నెల్లిపాకలో నిర్వహించారు. ఆదివారం ఎటపాక మండలం, నెల్లిపాక పంచాయతీ లో గోగుబాక గ్రామ ప్రజలు ఆదర్శంగా నిలిచారు. స్థానిక పంచాయతీ పిలుపు మేరకు సుమారు 200 మంది గ్రామస్థులు స్వచ్ఛందగా పాల్గొని " శ్రమదానం " నిర్వహించి రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించుట, చెత్తకుప్పలను ఎత్తివేయుట, మురుగు నీరు పోవుటకు కచ్చా డ్రైన్ తవ్వకం వంటి పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సర్పంచ్ శ్రీమతి కొరసా భద్రమ్మ, వార్డు సభ్యులు రమేష్ బాబు, కాకర్ల చంటి, %ూజుూూ% ఉపాధ్యక్షులు దివ్య, ఎఈపీటీసీ అంజలి, పంచాయతి కార్యదర్శి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హాజరైన వారందరికి స్థానిక ఎన్ టి ఆర్ ట్రస్ట్ చైర్మన్ నలజాల శంకర రావు భోజనాలను ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధి విషయంలో అందరూ ఒక్క మాటపై నిలబడి ఉత్సాహంగా శుభ్రత కారుక్రమంలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. మీ గ్రామంలో వసూలు చేయబడ్డ ఇంటిపన్నులు మీ గ్రామంలోనే ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంటామని వక్తలు తెలియజేసారు.

అదుపు తప్పిన టెంపో వ్యాన్

విశాలాంధ్ర-మోతుగూడెం : ఆదివారం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఘాటీ రోడ్‌లోగల వన దుర్గ ఆలయం వద్ద కాకినాడలోని మారుతి సుజుకి షోరూంలో పనిచేస్తున్న 15 మంది ప్రయాణిస్తున్న టెంపో వ్యాన్ అదుపుతప్పి లోయ లోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి స్వల్పగాయాలు కాగా, ఒక ప్రయాణీకుడి పరిస్థితి విషమంగా ఉంది. అతన్ని రంపచోడవరంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మోతుగూడెం ఎస్సై ఎస్.కే.సాదిక్ కేసు దర్యాప్తు చేపట్టారు.